
# వందనోటు

—యర్రంశెట్టి శాయి




**అనగనగా** ఒక వంద నోటు.

ఆ వంద నోటు కొత్తగా ప్రింటింగ్ ప్రెస్ నుంచి ఈ ప్రపంచంలోకి వచ్చింది. దేశమంతా కేరింతాలు కొడుతూ విహరించా లనిపించింది దానికి. కానీ, అలా విహరించే అధికారం ప్రజలకే లేదు. ఏ రౌడీలో ఉన్నవన్నీ ఊడబెరుక్కుని, శరీరాన్ని రెండు పెట్టి భాగించి అవతల పడేస్తారు. ఆ తరవాత పోలీసులు వచ్చి మరి కొంత భాగించి తగలబెట్టేస్తారు. కనక ఇక నోటు ఎలా విహరించ కలుగుతుంది? అందుకని అక్కడే ఉండిపోయింది.

ఒక రోజు దాన్ని ఇనప పెట్టెలో పడేసి రిజర్వ్ బాంక్‌కు మోసుకు వెళ్ళి అక్కడ విసిరేశారు.

అక్కడి నుంచి మళ్ళీ ఇంకొక బాంకుకు ప్రయాణం చేయించారు. చివరికి ఒక ప్రభుత్వపు ఆఫీసు సిబ్బంది జీతంగా మారి సుబ్రహ్మణ్యం అనే గుమాస్తా చేతిలో పడింది.

సుబ్రహ్మణ్యం ఈ నోటు వంక ఆనందంగా చూశాడు.

"సరికొత్త నోటు! ఎంత బాగుందో!" అని ముచ్చటపడ్డాడు.

'ఇలాంటి నోట్లు మరో అర డజను ఉంటే ఎంత బాగుంటుందో!' అని కూడా అనుకున్నాడు.

కొత్తనోటు తనతోబాటు వచ్చిన మరొక ముసలి నోటును చూసి వెక్కిరించింది. "ఛీ! ముడతలు పడిపోయి ఎంత అసహ్యంగా ఉన్నావో! నీ ఏజు ఎంత?" అని అసహ్యించుకుంటూ అడిగింది.

ముసలినోటు బోసి పళ్ళతో నవ్వింది.

"పిచ్చి ముఖమా! వయసు మూలాన కాదే నా రూప మిలా తయారయింది! ఒక ప్రదక్షిణ పూర్తయే సరికి నువ్వూ ఇలాగే తయారవుతావు! ఎంత నికృష్టపు ప్రదక్షిణలు చాలా చేయాలి మనం! నే నందుకే ఎప్పుడూ దేవుడిని కోరుకుంటూ ఉంటాను, ఈ పాడు ప్రదక్షిణలు నా వల్ల కాదు, ప్రభూ! నన్ను ప్రింటింగ్ ప్రెస్‌కు తీసుకువెళ్ళి, మళ్ళీ జన్మలేకుండా నీలో ఐక్యం చేసుకో అని!"

కొత్తనోటు పాతనోటు మాటలు నమ్మలేదు. ఈ లోగా సుబ్రహ్మణ్యం భార్య రెండింటినీ తీసుకు వెళ్ళి దేవుడి దగ్గర పెట్టి దణ్ణం పెట్టింది. ఆ తరవాత సుబ్రహ్మణ్యం కొత్త నోటును జేబులో పెట్టుకుని ప్రావిజన్ స్టోర్స్ చేరుకున్నాడు. అక్కడ ఆయుదారు వస్తువులు కొనేసరికే "వందరూపాయ లయింది" అన్నాడు షాపువాడు.

"అబ్బ! అంత పెరిగిపోయాయా ధరలు మళ్ళీ?!" ఆశ్చర్యపోతూ వంద నోటు తీసి ఇచ్చాడు సుబ్రహ్మణ్యం.

షాపువాడు వంద నోటు అందుకుని తన కాష్ బాక్స్‌లో పడేశాడు. అక్కడ అలాంటి నోట్లు బోలెడు ఉన్నాయి.

"నిత్యావసర వస్తువుల వ్యాపార మంత లాభసాటి వ్యాపారం ఇంకోటి లేదనుకో" అన్నాడు షాపువాడు పక్కనున్న తన స్నేహితుడితో.

"ఎంత పెర్సంటేజి మిగులుతుంది?" అడిగాడు స్నేహితుడు.

"సగానికి సగం! అధికారికంగా కొలతల్లో కూడా మరి కొంత లాభం! అఫ్‌కోర్స్! నేను అంత పెద్ద ఎత్తున కల్తీ చేయన్లే." నవ్వుతూ అన్నాడతను.

కొత్త వంద నోటుకు ఒళ్ళు మండిపోయింది.

"అంటే తన విలువను ఈ దుర్మార్గుడు సగానికి పైగా తగ్గించేశాడన్న మాట!' అనుకుంది పళ్ళు కొరుకుతూ.

పళ్ళు కొరుకుతూండగానే షాపు ముందు కారు ఆగింది. అందులో నుంచి బిలబిలమంటూ ఖద్దరు బట్టల వాళ్ళు దిగి షాపులోకి వచ్చారు.

"వీరు మంత్రిగారు" అంటూ ఒక శాల్తీని మరొక శాల్తీ పరిచయం చేసింది.

షాపువాడు రెండు చేతులూ జోడించి సాష్టాంగ నమస్కారం చేశాడు.

"ఎలక్షన్లొస్తున్నాయ్ గదా? పార్టీకి మరి డబ్బు కావాలి! మీరు పదివేలయినా ఇవ్వకపోతే బాగుండదు" అన్నది ఒక శాల్తీ.

షాపువాడు గుండె బాదుకున్నాడు.

"బాబోయ్! నా ఆస్తి అంతా కలిపితే పదివేలు ఉండదు!" అన్నాడు మళ్ళీ నమస్కారం చేస్తూ.

"అలాగ?! అయితే నీ మాట నిజమో, కాదో టాక్స్ వాళ్ళను నీ ఇంటికి పంపి తేల్చుకుంటాం!" అన్నారు మంత్రిగారు.

"సేల్స్ టాక్సువాళ్ళనూ, వెయిట్స్ అండ్ మెజర్‌మెంట్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళనూ, హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్ళనూ — అంటే యాంటి ఎడల్టరేషన్ అన్నమాట — ఇన్‌కమ్‌టాక్స్ వాళ్ళనూ అందర్నీ పంపుతాం! వాళ్ళంతా కలిసి నీ ఆస్తి పదివేలు లేదంటే నిన్ను పదివేలు అడగం!" అన్నాడు ఒక శాల్తీ.

షాపువాడు మళ్ళీ సాష్టాంగపడి కొత్తనోటుతో సహా మిగతా నోట్లు కూడా లెక్కపెట్టి పదివేలు మంత్రిగారికి ఇచ్చేశాడు. కొత్తనోటు కోపంతో ఉడికిపోయింది. మళ్ళీ పళ్ళు కొరికేసరికి పళ్ళు కాస్తా పూడిపోయాయి.

సుబ్రహ్మణ్యం దగ్గరినుంచి షాపువాడికి ఇచ్చినప్పుడే తన విలువ సగానికి పైగా పడిపోయింది ఇప్పుడు పూర్తిగా విలువ పోయినట్లే! తనను ఒక గడ్డి పరకగా భావించి మినిస్టరుకు ఇచ్చేశాడు షాపువాడు.

మినిస్టరు దగ్గిర కొన్ని రోజులబాటు కదలిక లేకుండా ఉండిపోయిం దది. అక్కడ ఇంకా బోలెడు నోట్లు ఉన్నాయి—సరదాగా ఆడుకోవడానికి, మాట్లాడుకోవడానికి. అందులో కొన్ని షాపుల నుంచీ, కొన్ని హోటళ్ళ నుంచీ, కొన్ని బార్స్‌నుంచీ, కొన్ని కంట్రాక్టర్ల నుంచీ వచ్చాయట.

ఆ తరవాత హఠాత్తుగా ఆ కొత్త నోటును మరి కొన్ని నోట్లకు జతచేసి పేరు మోసిన పెద్ద రౌడీకి ఇచ్చారు మినిస్టరుగారు.

కొత్తనోటు మరీ ఆశ్చర్యపోయింది.

'ఇదేమిటి?! ఆ షాపువాడు తనను ఒక గడ్డి పరకగా భావించాడంటేనే ఆశ్చర్య పోయింది. మరి ఈ మినిస్టరు కూడా అలాగే భావించి తనను తేలికగా ఈ రౌడీకి ఎందుకు దానమిచ్చినట్లు?'

## సిగ్గు

సిగ్గు అనేది ఒకసారి గనుక తొలగిపోతే తిరిగి రావడం ఉండదు.

— సెనీకా

దానికేమీ అర్థం కాలేదు. తనకెందుకు తెమ్మని ఆలోచించడం మానివేసింది.

ఆ రౌడీ వెంటనే మరో పది మంది చిన్నసైజు రౌడీలను వెంటతీసుకుని ప్రభుత్వపు సారాదుకాణం చేరుకున్నాడు. అక్కడ రాత్రి పన్నెండింటి వరకూ తాగా రందరూ. అప్పుడు మాసి, కల్లు చేతులతో కొత్త నోటును, మరి కొన్నిటిని బయటికి లాగి, దానినిండా మరకలు చేసి, సారా దుకాణం వాడికి ఇచ్చాడు రౌడీ.

వాడు దాన్ని మరి కొన్ని సారా మచ్చల నోట్లతో కలిపి ఒక కట్టగా కట్టి జేబులో పెట్టుకున్నాడు.

మరునాడు ఆ కట్ట జేబులో పెట్టుకుని బాంకు వెళుతూంటే ఒక జేబు దొంగ టకీమని ఆ కట్టను తన సొంతం చేసుకున్నాడు.

'ఓర్నీ! ఈ ప్రయాణం భలే తమాషాగా ఉందే!' అనుకుని కేరింతాలు కొట్టింది కొత్తనోటు.

వాడు కొంత దూర మయినా వెళ్ళకముందే ఒక పోలీస్ కాన్‌స్టేబుల్ వచ్చి వాడి చొక్కా పట్టుకున్నాడు.

"ఏరా! ఎన్ని గిరాకీలు దొరికాయి ఈ వేళ?" అన్నాడు చొక్కా వదలకుండానే.

"ఎక్కడ, సార్! ఒక్కటి కూడా లేదు..."

"నీ యమ్మ! నువ్వలా నిజం ఎందుకు చెబుతావురా? పద!" అంటూ మెడబట్టి లాక్కుపోసాగాడు.

"వదిలెయ్యండి, సార్! ఒకే ఒక జేబు దొరికింది! అందులో ఎంత ఉందో కూడా ఇంకా చూడలేదు" అన్నాడు బతిమాలుతూ.

"అలా దారికి రా, నాయాలా!" అంటూ వాడిని ఆ పక్కనే ఉన్న పార్కులోకి తీసుకు వెళ్ళాడు పోలీసు.

వాడు జేబులోనుంచి నోట్ల కట్ట తీశాడు.

కొత్తనోటుతో సహా సగానికి పైగా నోట్లను తన జేబులో కుక్కుకున్నాడు పోలీస్.

"పోరా ఇంక, వెధవ నాయాలా! మరోసారి ఇలా జేబులు కొట్టావంటే లోపల వేసేస్తాను" అన్నాడు వాడి వీపుమీద ఒకటి ఇస్తూ.

జేబుదొంగ జేబులోనుంచి పోలీసు జేబులోకి వచ్చేసరికే కొత్త నోటు అవతారం మురికిగా తయారయింది.

ఆ సాయంత్రం కొత్తనోటును బ్రాందీషాపులో ఇచ్చి బ్రాందీ సీసా తీసుకు వెళ్ళాడు పోలీసు.

బ్రాందీషాపు యజమాని దాన్ని తీసుకువెళ్ళి డాక్టరుకు ఫీజుగా ఇచ్చేశాడు. డాక్టరు భార్య దానిని తీసుకు వెళ్ళి బట్టల షాపు వాడికి ఇచ్చింది. బట్టల షాపు వాడు ఆ నోటును కాబరే డాన్సు చేసే అమ్మాయికి ఇచ్చాడు. ఆ అమ్మాయి అందులో కొన్నినోట్లు ఐ. ఎ. వాళ్ళకు ఇచ్చి బొంబాయికి టికెట్ తీసుకుంది. వాళ్ళు ఆ నోట్లన్నీ బాంకులో వేశారు. అక్కడినుంచి కొత్తనోటు మళ్ళీ రిజర్వ్ బాంక్ చేరింది. అప్పటికి చిరిగిపోయేందుకు సిద్ధంగా ఉం దది.

అందుచేత దాన్ని సర్క్యులేషన్ నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు రిజర్వ్ బాంక్ వాళ్ళు.

వెంటనే దాన్ని వేరే గదిలోకి మార్చారు.

అక్కడ కాళ్ళు చేతులూ పడిపోయి నిలబడే శక్తి లేని అనేకమైన నోట్లను చూచి కొత్తనోటు ఆశ్చర్యపోయింది.

"ఇంతమందిని అన్‌ఫిట్ అన్నారు కాని, మరి ఇక్కడికి రాకుండా ఇంకా చేతులుమారుతున్న నోట్ల సంగతేమిటి?" అని పక్కనున్న వాటిని అడిగిం దది.

"ఇక్కడికి రాకుండా ఏమైనాయి?" అడిగింది మరొక నోటు. "ఏమో? నేను బయలుదేరేటప్పుడు నాతో చాలా నోట్లు ఉన్నాయి కాని, తరవాత కొన్ని ప్రావిజన్ షాపులోను, కొన్ని మినిస్టరు దగ్గరా, కొన్ని రవుడీల దగ్గరా, మరి కొన్ని సారా దుకాణం వాడి దగ్గరా, కొన్ని పోలీస్ దగ్గరా, ఇంకొన్ని బ్రాందీ షాప్ యజమానిదగ్గరా, మరి కొన్ని డాక్టర్ దగ్గరా, బట్టలషాపువాడి దగ్గరా, కాబరే ఆర్టిస్ట్ దగ్గరా ఉండిపోయాయి! అవి ఇక్కడికి ఎందుకు రాలేదు?"

ఒక నోటు పకపకా నవ్వింది.

"పిచ్చి ముఖమా! వాటినే బ్లాక్ మనీ అంటారు. అవి ఇంకచస్తే వెలుగు చూడలేవు! అలా చీకట్లోనే చేతులు మారుతుంటాయి!"

కొత్తనోటు సంతృప్తి పడింది.

"ఆ జీవితం కంటే ఇలా మూలపడిపోయి జీవితం ముగించడమే మంచిది!" అంది కుంచించుకుపోతూ.

★